
సాక్షి
బాపట్ల
బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



నేడు పూర్ణాహుతి


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో బుధవారం పూర్ణాహుతి జరుగుతుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.7,800, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహర్ (గురు)
బాపట్ల	6:26	4:43
నరసరావుపేట	6:28	4:42
గుంటూరు	6:26	4:43



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎస్పీ వకుల్‌జిందాల్



ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్‌జిందాల్ దంపతులను సత్కరిస్తున్న జిల్లాలోని పోలీస్ అధికారులు

అభివృద్ధిలో ముందున్నాం

- జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్
- ఘనంగా జిల్లా ఆవిర్భావ వేడుకలు

బాపట్ల: బాపట్ల జిల్లా అభివృద్ధిలో ముందున్నామని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చెప్పారు. మంగళవారం జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు కేక్ కట్ చేశారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలో గడచిన సంవత్సర కాలంలో అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా ఏర్పాటు తరువాత అన్ని శాఖల సమన్వయంతో జిల్లాను ప్రగతి పథంలో నడిపించామన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించామన్నారు. జిల్లాలో అధికారుల కృషి వల్ల అభివృద్ధి సాధ్యమైందన్నారు. రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తితో అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అధికారులకు, ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఏడుగురు లబ్ధిదారులకు కిరాణా షాప్, టెంట్ హౌస్, కూల్ డ్రింక్స్ షాప్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏడుగురు విభిన్న ప్రతిభావంతులకు రూ.5లక్షల వంతున చెక్కులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీశివజ్యోతి, సీపీఓ భరత్‌కుమార్, డీఎస్‌ఓ విలీమ్స్, జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ వకుల్ జిందాల్

రాష్ట్రస్థాయిలో గుర్తింపు

బాపట్లటౌన్: నూతనంగా ఏర్పడిన జిల్లా అయినప్పటికీ రోడ్డు ప్రమాదాలను నివారించడంలో రాష్ట్రంలోనే బాపట్లకు ప్రత్యేక గుర్తింపు రావడం హర్షనీయమని ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. బాపట్ల జిల్లా ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సోమవారం రాత్రి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో వేడుకలను పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎస్పీలు, అడిషనల్ ఎస్పీ, ట్రైనీ ఎస్పీల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రకాశం జిల్లా ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత పోలీస్ శాఖ పరంగా అనేక సమస్యలను ఎదుర్కొన్నారని, పోలీస్ అధికారులు అందరూ సమన్వయంతో పని చేయటం వలన వాటి ఫలాలను ప్రస్తుతం మనం చూడగలుగుతున్నామన్నారు. దీనికి అధికారుల సేవలు ఎనలేనివన్నారు. ప్రకాశం జిల్లా నుంచి కావాల్సిన సహాయ సహకారాలు అందించామని, ఇక మీదట కూడా అందించడానికి వెనకాడబోమన్నారు. బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ సబ్ డివిజన్‌గా ఉన్న బాపట్ల ఒక్కసారిగా జిల్లాగా రూపాంతరం చెందటంతో సిబ్బంది విధుల నిర్వహణ సవాలుగా మారిందన్నారు. పోలీస్ సిబ్బంది, అధికారుల విశేష కృషితో అంచెలంచెలుగా అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. అధికారులు, సిబ్బంది సేవలు, సహకారం మరువలేనివన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ట్రైనీ ఐపీఎస్ అధికారి అనిత సురాన, అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డీఎస్పీలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

చిరకాల వాంఛ నెరవేరింది

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- ఘనంగా బాపట్ల జిల్లా ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి, చిత్రంలో ఎంపీ సురేష్, ఎమ్మెల్యే కోన

బాపట్ల: బాపట్ల జిల్లా ఆవిర్భావ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేళ తాళాలు, కోలాట నృత్యాలు, నెమలి నృత్య ప్రదర్శన, డప్పు కళాకారులు, వాయిద్య కళాకారుల ప్రదర్శనలు పట్టణ ప్రజలను అబ్బురపరిచాయి. రథంబజారులోని భావనారాయణస్వామి దేవాలయం వద్ద నిర్వహించిన సంబరాలకు అశేష జనం హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి కుటుంబ సమేతంగా భావనారాయణస్వామికి పొంగలి నివేదించారు. ముందుగా కుంభమేళాతో దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం జిల్లా అధికారులను ప్రజాప్రతినిధులు, ప్రజాప్రతినిధులను అధికారులు సత్కరించారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్, అంబేద్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ముఖ్యమంత్రి సాహసోపేత నిర్ణయాలతో ముందుకు వెళ్తున్నారని చెప్పారు. బాపట్ల జిల్లా ఏర్పాటుతో ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్నారు. నిజాంపట్నం పోర్టు రెండవ దశ విస్తరణ, అభివృద్ధి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. చీరాల ఓడరేవు నిర్మాణం, తీర ప్రాంతాల అభివృద్ధితో జిల్లా పర్యాటక ప్రాంతంగా రూపుదిద్దుకోనుందని వివరించారు. అభివృద్ధికి అవసరమైన సహజ వనరులన్నీ జిల్లాలో పుష్కలంగా ఉన్నాయని అభివర్ణించారు. జిల్లా ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ పేదరికంలో ఉన్న వారిని స్థితిమంతులుగా చేయడానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఒకసారి ప్రజలకు ఏదైనా మాట ఇస్తే ముఖ్యమంత్రి జగన్ మరిచిపోరని అన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్ల జిల్లా అభివృద్ధి వైపు ముందుకు సాగుతోందని అన్నారు. బాపట్లకు త్వరలో కొత్తగా రైల్వేలైన్ రానుందన్నారు. ప్రజల ఆకాంక్షలు, కలలు సాకారం అయ్యాయని, ముఖ్యమంత్రి జగన్ నిర్ణయంతోనే ఇది సాధ్యమైందని అన్నారు. జిల్లా ఆవిర్భావం అనంతరం జిల్లా యంత్రాంగం చేసిన కృషిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేస్తే బాపట్ల జిల్లా మరింత పురోభివృద్ధిలో పయనిస్తుందని అన్నారు. ప్రజలకు సేవలందించడం, మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు చేసిన కృషిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రజలంతా సహకరించారని అన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించే వాతావరణ కల్పించడానికి పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందన్నారు. జేసీ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ చుక్కల భూముల కింద తొమ్మిది వేల ఎకరాల భూములను గుర్తించి హక్కుదారులకు పూర్తి హక్కులు కల్పించేలా నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలగించామని తెలిపారు. చీరాల–చిలకలూరిపేట, నిజాంపట్నం–బుడంపాడు వరకు రెండు జాతీయ రహదారులు జిల్లాకు వస్తున్నాయని చెప్పారు. జిల్లా అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతితులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన గరటయ్య, చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, బుడా వైస్‌చైర్మన్ ఏ.భానుప్రతాప్, జిల్లా రెవెన్యూ అధికారి కె లక్ష్మి శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న పెన్షన్ పంపిణీ



నెహ్రూనగర్: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ మంగళవారం కొనసాగింది. లబ్ధిదారుల వేలిముద్రలు, ఐరీష్ ఆధారంగా వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించారు. జిల్లాలో మంగళవారం 70.66 శాతం పంపిణీ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,52,367 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.69.34 కోట్లు కేటాయించింది. సాయంత్రానికి 1,78,335 మంది లబ్ధిదారులకు రూ.49.18 కోట్లు అందజేశారు.

54.0 మిల్లీమీటర్ల వర్షపాతం

బొల్లాపల్లి: మండలంలో అకాల వర్షం పడింది. మండలంలో 54.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఈదురు గాలులతో ఎడతెరిపి లేకుండా ఒక గంటపాటు కురిసిన వర్షానికి వెల్లటూరు, నాయుడుపాలెం, గ్రామ పరిసరాల్లో కోత కోసి కొన్ని కల్లాలు ఆరబెట్టిన మిర్చి తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్రీడా శిక్షణ శిబిరాలకు దరఖాస్తులు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు సంస్థ సీఈఓ ఎస్.పల్లవి, డీఎస్‌ఏ స్టేడియం చీఫ్ కోచ్ చావలి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ మే ఒకటో తేదీ నుంచి 31 వరకు ఉంటుందని చెప్పారు. పల్నాడు జిల్లా పరిధిలో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న క్రీడా అసోసియేషన్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు ఈనెల 5వ తేదీ సాయంత్రం 5గంటలలోగా స్టేడియంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు..

తాడికొండ: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థతో నిర్వహించబడుతున్న తాడికొండ గురుకుల పాఠశాల (రీజనల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ- బాలురు) లో 2023–24 విద్యా సంవత్సరానికి 5,6,8 తరగతులకు మిగిలిన ఖాళీలకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ బాలశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు మంగళవారం నుంచి 24వ తేదీ వరకు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే, 5న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రెస్టారెంట్‌లపై కేసు నమోదు



గుంటూరు మెడికల్: గుంటూరు నగరంలో పలు రెస్టారెంట్‌లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు మంగళవారం కేసులు నమోదు చేశారు. నిబంధనల ప్రకారం వంట నూనెను పలు మార్లు వేడి చేసి వినియోగించకూడదు. కాని గుంటూరు నగరంలోని నగరంపాలెం మస్తాన్‌దర్గా సమీపంలోని మ్యాక్‌డోనాల్డ్ రెస్టారెంట్‌లో పలు మార్లు మరిగించిన నూనెను వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ షేక్ గౌస్ మొహిద్దీన్ తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన సదరు రెస్టారెంట్‌పై కేసు నమోదు జాయింట్ కలెక్టర్ కోర్టుకు నివేదిక అందజేశామన్నారు. అదే విధంగా ఇటీవల కాలంలో జేకేసీ కళాశాల రోడ్డులోని ఓరియన్ రెస్టారెంట్‌లో కూడా తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా మరిగించిన నూనె వినియోగిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశామని చెప్పారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 528.60 అడుగుల వద్ద ఉంది. ఇది 165.4272 టీఎంసీలకు సమానం. జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,351, ఎస్‌ఎల్‌బీసీకి 1,350, వరద కాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లోగా 6,021 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సినీ నిర్మాత దగ్గుబాటి మోహన్‌బాబు మృతి

- మూవీ మొఘల్ డాక్టర్ రామానాయుడు సోదరుడు

కారంచేడు: దివంగత మూవీ మొఘల్ డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు సోదరుడు మోహన్‌బాబు (72) మంగళవారం ఉదయం మృతిచెందారు. ఈయన కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. కొంతకాలం హైదరాబాద్‌లోని కుమార్తెల వద్దనే ఉన్న అయన ఈ మధ్యనే గ్రామానికి తిరిగి వచ్చారు. మంగళవారం ఉదయం గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను చీరాలలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు చెప్పడంతో మృతదేహాన్ని కారంచేడులోని ఆయన స్వగృహానికి తరలించారు. 'ఒక చల్లని రాత్రి' అనే సినిమాకు మాత్రమే ఆయన నిర్మాతగా వ్యవహించినట్లు చెప్తున్నారు. ఈయన సినిమాలు, రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యవసాయంపై మక్కువ కలిగి ఉండే వారని స్థానికులు తెలిపారు. మృతి విషయం తెలిసిన వెంటనే ఆయన కుటుంబసభ్యులు కారంచేడు చేరుకున్నా రు. మనుమళ్లు లండన్ నుంచి వస్తున్నట్లు సమాచారం.

చిన్నాన్నకు సురేష్‌బాబు నివాళులు

తన చిన్నాన్న మోహన్‌బాబు మృతదేహానికి రామానాయుడు కుమారుడు, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు, ఆయన చిన్న కుమారుడు అభిరామ్‌లు నివాళులర్పించారు.



డి.మోహన్‌బాబు

వీరితోపాటు డాక్టర్ రామానాయుడు సతీమణి రాజేశ్వరి, సురేష్ బాబు భార్య లక్ష్మి, సినీ హీరో వెంకటేష్ భార్య నీరజ, మనుమళ్లు, మనుమరాళ్లతోపాటు విలక్షణ నటుడు మోహన్‌బాబు బావమరిది కొల్లా అశోక్ బాబు నివాళులర్పించారు. మోహన్‌బాబు మృతదేహానికి చీరాల ఎమ్మెల్యే బలరాం కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావులు నివాళులర్పించారు.

నేడు అంత్యక్రియలకు హాజరుకానున్న వెంకటేష్, రానా

బుధవారం మధ్యాహ్నం కారంచేడులో జరిగే మోహన్‌బాబు అంత్యక్రియలకు హీరోలు వెంకటేష్, రానాలు కుటుంబ సభ్యులతో కలసి హాజరవుతారని సన్నిహితులు చెప్పారు. హైదరాబాద్ నుంచి గన్నవరం వరకు విమాన మార్గంలోను, అక్కడ నుంచి రోడ్డు మార్గాన వారు కారంచేడు చేరుకుంటారని తెలుస్తోంది.

అభాగ్యులపై వాత్సల్యం

- ఆర్థికంగా చేయూత
- ఏప్రిల్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలి

బాపట్లఅర్బన్: విధి వంచితలకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ఎటువంటి ఆదరణ లేని అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూతనిచ్చేందుకు చర్యలు చేపడుతుంది. వారి విద్య, వైద్య అవసరాలను తీర్చేందుకు ఆర్థిక చేయూతనందించనుంది. మిషన్ వాత్సల్య పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పాన్సర్‌షిప్ కల్పిస్తున్నాయి. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని చేపట్టారు. జిల్లాలో ఉన్న అనాథలు, అభాగ్యులు తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమైన వారు, పాక్షిక అనాథలు(తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు) విడాకులు పొందిన తల్లిదండ్రులు ఉన్నవారు, కుటుంబం వదిలేసిన తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారినపడి పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన బాలల న్యాయ ఆదరణ సంరక్షణ చట్టం -2015 ప్రకారం ఇల్లు లేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాల కార్మికులు అక్రమ రవాణ దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహ, హెచ్‌ఐవీ బాధిత బాలలు దివ్యాంగులకు పథకం ద్వారా ఒక్కొక్కరికి నెలకు రూ.4వేలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.

వార్షిక ఆదాయం పరిమితి

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం రూ.72వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96వేలు మించరాదు. జే జే బోర్డు సంక్షేమ కమిటీ లిఖితపూర్వకంగా నమోదు చేసిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి స్పాన్సర్‌షిప్ పొడిగించవచ్చు. స్పాన్సర్‌షిప్ అందుకుంటున్న బాలలను ఏదైనా వసతి గృహం బాలసదనంలో చేర్పించిన తరువాత సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విషయంలో మినహా పాఠశాలలకు వెళ్లేవారు, పాఠశాల హాజరు 30 రోజులకు పైగా సక్రమంగా లేదని తేలిన పరిశీలించి తాత్కాలికంగా నిలిపివేస్తారు.



మిషన్ వాత్సల్య పథకం బ్రోచర్

దరఖాస్తు పరిశీలన

సీడీపీఓ కార్యాలయానికి అందిన దరఖాస్తులన్నింటిని మండల స్థాయి అధికారులు నిశితంగా పరిశీలించి అర్హత కలిగి ఎంపిక చేసిన ప్రతి దరఖాస్తుపై కమిటీ సభ్యులందరూ సంతకం చేసిన తరువాత కార్యాలయానికి సమర్పిస్తారు.

సీడీపీఓలకు ఆదేశాలు

మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించి దరఖాస్తులు తీసుకోవాలని సీడీపీఓలకు ఆదేశాలు జారీ చేశాం. వారి నుంచి వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– కె.ఉమ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి, బాపట్ల

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలు మండలంలో రూ.8.12 కోట్ల ఆసరా నగదు పంపిణీ



భట్టిప్రోలులో వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి నాగార్జున, పక్కన ప్రజాప్రతినిధులు, అధికారులు

భట్టిప్రోలు: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి, స్థిరపడటానికి వైఎస్సార్ ఆసరా నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ అధ్యక్షతన ఆసరా సంబరాలు నిర్వహించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ పార్టీలు, కుల, మత, ప్రాంత బేధాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. గత ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో స్వయం సహాయక సంఘాల కష్టాలు చూసిన జగన్ ఎన్నికలకు ముందు తీసుకున్న రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పారని....ఆ మాట ప్రకారం నాలుగు విడతలుగా మాఫీ చేసి మహిళల బ్యాంకు ఖాతాల్లో విడతల వారీగా నగదు జమ చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా భట్టిప్రోలు మండలంలో 1008 గ్రూపులకు రూ.8.12 కోట్లు నగదు జమ అయ్యిందన్నారు. అన్ని పథకాలు మహిళల పేరుపై అమలు చేయడం, మహిళల్లో ఆత్మస్థైర్యం తీసుకురావడం జగన్‌కే సాధ్యమైందన్నారు. అందు కోసం ఆయన అహర్నిశలు పాటుపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, ఆసరా పథకం మూడో విడత కింద రూ.8.12 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. ఈ సంబరాలకు మండలాల్లోని అన్ని సంఘాల నుంచి వేలాదిగా మహిళలు హాజరయ్యారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీలు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, పీటా శ్రీనివాసరావు, అగ్నికుల క్షత్రియ, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్లు శేరు శ్రీనివాసరావు, పడమట శ్రీనివాసరావు, సూరేపల్లి, భట్టిప్రోలు పీఏసీఎస్ చైర్ పర్సన్లు గోవర్ధనగిరి చిన బుజ్జి, గుమ్మడి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, తహసీల్దార్ ఎంఎల్ శ్రావణ్‌కుమార్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.



లింగంగుంట్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డికి సూచనలు చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



విభాగాల వారీగా ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

సీఎం వైఎస్ జగన్ పర్యటన వివరాలు

చిలకలూరిపేట: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

- గురువారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి తాడేపల్లిలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- అక్కడి నుంచి 9.40కు బయలు దేరి 10 గంటలకు లింగంగుంట్ల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులతో మాట్లాడి లింగంగుంట్లలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్‌కు చేరుకుంటారు.
- విలేజ్ హెల్త్ సెంటర్ పరిశీలన అనంతరం 10.25కు సమీపంలోని ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ స్టాళ్లను పరిశీలించనున్నారు.
- 10.42కు సభా ప్రాంగణానికి చేరుకుంటారు.
- 11 గంటల నుంచి 11.30 వరకు సభను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. -11.40కు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ స్థానిక నాయకులతో మాట్లాడి మధ్యాహ్నం 12 గంటలకు తాడేపల్లికి తిరుగు ప్రయాణం అవుతారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'

మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే శివకుమార్


మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీచైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లు అన్నారు. మంగళవారం స్థానిక పాలకేంద్రం కల్యాణమండపంలో కొల్లిపర, చివలూరు, అన్నవరం, అన్నవరపులంక, బొమ్మువానిపాలెం, చక్రాయపాలెం, చెముడుబాడు, హన్‌మాన్‌పాలెం, సిరిపురం, తూములూరు, దావులూరు, దావులూరిపాలెం గ్రామాలల్లోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత మెగా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లు పాల్గొని 12గ్రామాల్లోని 776 సంఘాలకు రూ.6.42కోట్ల చెక్కును డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు అందించారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ పథకాల పేరిట మహిళల ఖాతాల్లో రూ.4,355 కోట్లు జమచేశారని కొనియాడారు. చంద్రబాబు నాయుడు 600 హామీలిస్తే అందులో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ కొల్లిపర మండలంలో 1247 సంఘాల్లోని 12,464 మంది సభ్యుల ఖాతాల్లో మూడు విడతల్లో మొత్తం రూ.29.64కోట్లు జమ చేసినట్లు తెలిపారు. సభ అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే శివకుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సమక్షంలో డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచి పిల్లి రాధిక, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, ఏపీఎం డి.ప్రియదర్శిని, మండల సమాఖ్య అధ్యక్షురాలు తమ్మా సుజాత, ఎంపీటీసీలు, గ్రామాల సర్పంచ్‌లు, డ్వాక్రా మహిళలు, సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు మంగళవారం పలువురు కూచిపూడి నృత్య నీరాజనాలను అర్పించారు. హనుమాన్ నృత్య కళా నిలయానికి చెందిన శివశ్రీ, రిషిత, ధాత్రి, నిత్య, మీనాక్షి, లలిత, కార్తీక, వరూధిని పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం నృత్య కళాకారులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

7 నుంచి వెటరన్ క్రికెట్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్: చుక్కపల్లి పిచ్చయ్య మెమోరియల్ వెటరన్స్ క్రికెట్ ఇన్విటేషన్ టీ–20 టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టోర్నీ ఆర్గనైజర్లు కె.శ్రీనివాసరావు, డి.వి.సత్యనారాయణ తెలిపారు. విజయవాడ సత్యనారాయణపురంలో వారు మంగళ వారం విలేకరులతో మాట్లాడారు. మూలపాడు, మంగళగిరి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) స్టేడియాల్లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో లీగ్ కం నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. అనంతపురం, కడప, నెల్లూరు, పశ్చిమగోదావరి, హైదరాబాద్ వెటరన్–11, తెలంగాణ వెటరన్–11, విజయవాడ సెక్రటరీ–11, విజయవాడ ప్రెసిడెంట్ –11 జట్లు ఈ టోర్నీకి ప్రాతినిధ్యం వహిస్తాయని పేర్కొన్నారు. ఏడో తేదీ ఉదయం ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఈ పోటీలను ప్రారంభిస్తారని వెల్లడించారు. పాపులర్ షూ మార్ట్ అధినేతలు చుక్కపల్లి అరుణ్‌కుమార్, చుక్కపల్లి విజయ్‌కుమార్ ఆధ్వర్యాన, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రాకేష్, సీఈఓ వీరశివారెడ్డి, కృష్ణాజిల్లా క్రికెట్ అసోసియేషన్ అడహాక్ కమిటీ ప్రతినిధుల సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా పెంచలయ్య, ఎ.శ్రీధర్, బి.శ్రీనివాస్ వ్యవహరిస్తారని చెప్పారు.

2030 నాటికి గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యం

జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి హనుమంతరావు

ఆదిపూడి(కారంచేడు): రాబోవు 2030 నాటికి గాలికుంటు రహిత దేశంగా చేయడమే లక్ష్యంగా పశుసంవర్ధక శాఖ తీవ్రంగా కృషి చేస్తోందని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఆదిపూడి గ్రామంలో బాపట్ల జిల్లా మొదటి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన 'పశు విజ్ఞానబడి' కార్యక్రమాన్ని ప్రారంభించి, పశుపోషకులు, రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగని విధంగా ఈ ప్రభుత్వం రైతులకు, పశుపోషకులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో జిల్లాలో 408 ఆర్‌బీకేలను ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా పశుపోషణకు అవసరమైన విధంగా వెటర్నరీ అసిస్టెంట్‌లు, గోపాలమిత్రలను నియమించిందని తెలిపారు. వీరి ద్వారా పశువులకు సైతం గ్రామంలోనే వైద్యం అందించే ఏర్పాట్లు చక్కగా జరుగుతున్నాయన్నారు. గతంలో గాలికుంటు వ్యాధి సోకితే ఆ పశువుకు ప్రాణం పోవడం కంటే దాని ద్వారా జరిగే నష్టం ఎక్కువగా ఉండేదన్నారు. 2022–2023 వరకు జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదని, రాబోవు 2025 నాటికి సంపూర్ణంగా రాష్ట్రంలో వ్యాధి లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. అందుకోసం ఇప్పటికే రాష్ట్రంలో 30 విడతల వ్యాక్సిన్ కార్యక్రమం జరిగిందన్నారు. ఇప్పుడు 31వ విడత గాలికుంటు నివారణ వ్యాక్సిన్ కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్చూరు డివిజన్ సహాయ సంచాలకురాలు డాక్టర్ మాధవి, కారంచేడు పశువైద్యాధికారి డాక్టర్ ఆనంద్ భాగ్యరాజ్, కుంకలమర్రు గ్రామీణ పశువైద్యాధికారి డాక్టర్ చార్లెస్, గోపాలమిత్రలు, వెటర్నరీ అసిస్టెంట్‌లు, పశుపోషకులు, సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ హనుమంతరావు

అక్కచెల్లెమ్మలకు ప్రభుత్వం కొండంత అండ

- ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి
- డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేత


వైఎస్సార్ ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న గుంటూరు ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి

గుంటూరు వెస్ట్: మహిళలకు కొండంత అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గత మూడేళ్ల నుంచి వారి సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తుందని పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల శాసన సభ్యులు మద్దాళి గిరిధర్, మొహమ్మద్ ముస్తఫాలు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన వివిధ మహిళా సంఘాల గ్రూపు సభ్యులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గుంటూరు వెస్ట్, ఈస్ట్, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో 6420 గ్రూపులకు సంబంధించి 60,480 మహిళల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.50 కోట్లు జమ చేశారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలతో మహిళల ఆర్థికాభివృద్ధి గణనీయంగా పెరిగిందని చెప్పారు. అనంతరం నమూనా చెక్కును ఎమ్మెల్యేలు మద్దాళి గిరి, ముస్తఫా, మెప్మా పీడీ వెంకట నారాయణ, ఏటీ చెంచురాణి, పీఓ సాంబశివరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి సాంబశివరావు, అధికారులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి

రాష్ట్ర మార్కెటింగ్, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



పర్చూరు: చారిత్రాత్మకంగా పేరొందిన జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మార్కెటింగ్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి తెలిపారు. జిల్లా తొలి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. బాపట్ల భావపురిగాను, చీరాలను క్షీరపురిగాను, స్వర్ణను స్వర్ణపురిగాను, ఉప్పుటూరును లవణపురిగాను, చెరుకూరును ఇక్ష్వాపురిగాను, కొవ్వూరు గ్రామాన్ని శృంగపురిగా చారిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి చెందాయన్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయాలు ఎన్నో ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. చెరుకూరు అంటే ఇక్ష్వాపురి గ్రామంలోని అగస్తేశ్వర త్రివిక్రేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న శిల్ప సంపద ఎక్కడా లేదన్నారు. మూడేళ్లుగా ఈ ఆలయంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో ఆదాయం కోటి రూపాయలు పైన నిల్వ ఉందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఈ ప్రాంతంలోని దేవాలయాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా దేవదాయశాఖ మంత్రి ఉండడంతో ఆలయాలు అభివృద్ధి అయ్యేందుకు ఆస్కారం ఉందన్నారు. జిల్లాలో సముద్ర తీరప్రాంతం కూడా ఎక్కువగానే ఉందని, సూర్యలంక బీచ్, చీరాల ఓడరేవు, పెదగంజాం ఇలా ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నో సహజవనరులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో అన్నదాతలు కూడా ఎక్కువగా ఉన్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో వారు సైతం సుభిక్షంగా ఉన్నారన్నారు. బాపట్లను జిల్లా చేయాలని 50 ఏళ్ల క్రితమే కోన ప్రభాకరరావు, కొల్లా వెంకయ్య ఎన్నో ప్రయత్నాలు చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజల కోరికలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి బాపట్లను జిల్లాగా మార్చారన్నారు. ఎంతో మంది కళాకారులు, రంగస్థలం నటులు, నిర్మాతలు సినీ రంగ ప్రముఖులు ఈ ప్రాంతానికి చెందిన వారున్నారన్నారు. అలాంటి ప్రాంతంలో కళాకారులను గుర్తించి సముచిత గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిమీద ఉందని ఆయన పేర్కొన్నారు.

నకిలీ పాస్ పుస్తకాలతో బ్యాంకు రుణం

పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు.. పరారీలో ఇద్దరు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు, ముసుగులో నిందితులు

నూజెండ్ల: నకిలీ పాస్‌పుస్తకాలు బ్యాంకులో పెట్టి రూ. 76 లక్షలు రుణం తీసుకుని బ్యాంకును మోసం చేసిన నిందితులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. వినుకొండ రూరల్ సీఐ రమేష్‌బాబు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శావల్యాపురం మండలం పిచుకలపాలెం గ్రామానికి చెందిన తిరువీధి అశోక్, రవితేజ, యోగయ్య, తూమాటి వెంకటేశ్వరరావు, బోడేపూడి వెంకయ్యలతోపాటు వినుకొండ మండలం నరదాయపాలెం గ్రామానికి చెందిన చిన్న అంజయ్యలను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు 2016 నుంచి 2019 సంవత్సరాల వరకు నకిలీ పాస్‌పుస్తకాలు తయారీ చేసి శావల్యాపురం మండలంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రూ. 76 లక్షలు రుణం తీసుకున్నారు. అయితే రుణం చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలో దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేయగా, మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో శావల్యాపురం గల్లా రవికృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సింహ వాహనంపై ఆది దంపతులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ గంగ, పార్వతి (దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లకు మంగళవారం సింహవాహన సేవ నిర్వహించారు. చైత్రమాస బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం నూతన వధూవరులైన ఆది దంపతులకు వేద పండితులు సదస్యం, వేద స్వస్తి, వేద ఆశీస్సులు అందజేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీ గంగ, పార్వతి (దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వార్లను ఆలయ వైదిక కమిటీ, అర్చక బృందం, వేద పండితులు వేదస్వస్తి, ఆశీస్సులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఈఓ భ్రమరాంబ పాల్గొన్నారు. సాయంత్రం ఆది దంపతులకు సింహ వాహన సేవ నిర్వహించారు. మహా మండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవం కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కోమల విలాస్, మొయిన్ రోడ్డు మీదగా తిరిగి ఆలయానికి చేరుకుంది. సింహ వాహనంపై కొలువు దీరిన ఆది దంపతులకు చైర్మన్ కర్నాటి రాంబాబు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్త జనుల కోలాట నృత్యాల మధ్య ఊరేగింపు కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి, ఆలయ అర్చకులు, వేద పండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో భారీ వాహనాలను నియంత్రించండి

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి గురజాల ఎమ్మెల్యే కాసు వినతి


ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట: పిడుగురాళ్ల పట్టణ ప్రజలకు పెద్ద సమస్యగా తయారైన భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 216 కిలోమీటర్ల అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారి 2013 నాటికి ఓ నిర్మాణ సంస్థ 210 కిలోమీటర్ల వరకు దాదాపుగా పూర్తిచేసిందన్నారు. అందులో పిడుగురాళ్ల పట్టణంలోగుండా భారీ వాహనాలు వెళ్లకుండా బైపాస్‌రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో పదేళ్ల నుంచి ఈ బైపాస్‌రోడ్డు నిర్మాణం ఆలస్యమవుతుందన్నారు..

బైపాస్ నిర్మాణం కోసం భూసేకరణ, రైల్వే చార్జీలు చెల్లించాల్సి ఉండగా 2019 వరకు గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీంతో పనులు జరగక నిర్మాణ ధరలు రెండు మూడు రెట్లు పెరిగిపోయాయని నిర్మాణ సంస్థ చెబుతుందన్నారు. భారీ వాహనాలన్నీ పట్టణంలో నుంచి వెళుతుండడంతో ప్రజలకు చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. పిడుగురాళ్లలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటలవరకు భారీ వాహనాలు పట్టణంలోనికి రాకుండా చేయాల్సిన అవసరం ఉందని ఎస్పీని కోరారు. కాసు వెంట పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విద్య సమాజాభివృద్ధికి దోహదపడాలి


ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి

గుంటూరురూరల్: ప్రతి విద్యార్థి తాము చదువుకున్న విద్యతో ప్రాక్టికల్‌గా మంచి ప్రాజెక్టులను నెలకొల్పి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించి, సమాజాభివృద్ధికి దోహదపడాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగర శివారుల్లోని లాంఫాం నందున్న ఆడిటోరియంలో కమ్యూనిటీ సైన్స్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తి చేసుకుని జాతీయస్థాయిలో ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. కళాశాల డీన్ డాక్టర్ సీహెచ్ చిరంజీవి మాట్లాడుతూ కళాశాలలో ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించే దిశగా విద్యాబోధన చేసిన అధ్యాపకులను అభినందించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ చైతన్యకుమారి మాట్లాడుతూ ఏడాది కాలంలో విద్యార్థులు సాధించిన కృషిని తెలియజేస్తూ అభినందించారు. అనంతరం వీసీ చేతుల మీదుగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తెగిపడి అరటితోట దగ్ధం



తాడేపల్లిరూరల్: మంగళగిరి – తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని మెల్లెంపూడిలో మంగళవారం విద్యుత్ తీగలు తెగడంతో ఓ అరటితోట పూర్తిగా దగ్ధమైంది. సేకరించిన వివరాల ప్రకారం బొమ్మారెడ్డి దామోదరరెడ్డికి చెందిన పంట పొలంలో నుంచి వ్యవసాయ సంబంధిత విద్యుత్ లైన్లు వెళుతున్నాయి. విద్యుత్ తీగలు కండెన్సర్ వద్ద మంటలు చెలరేగి తీగలు తెగి అరటి తోటపై పడడంతో నిమిషాల వ్యవధిలో ఎకరంన్నరలో ఉన్న అరటితోట పూర్తిగా దగ్ధమైంది. ఇప్పుడిప్పుడే పంట చేతికి వస్తోందని, చెట్లు తగలబడడంతో అరటి గెలలు పొగచూరుకున్నాయని, ఒక గెల కూడా పనికి రాదని దామోదరరెడ్డి అన్నారు. అరటితోటలో వేసి డ్రిప్ పైపులైను పనికిరాకుండా పోయిందని, మొత్తం రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతు దామోదరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

11 మంది పందెం రాయుళ్లు అరెస్ట్.. 10 సెల్‌ఫోన్‌లు, 9 బైక్‌లు, 2 పందెం కోళ్లు స్వాధీనం

పెదకాకాని: కోడిపందేల స్థావరంపై నిర్వహించిన దాడుల్లో 11 మంది కోడిపందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు శివార్లలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు మంగళవారం స్థావరంపై పోలీసులు నిర్వహించిన దాడుల్లో 11 మంది కోడిపందేలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 10 సెల్‌ఫోన్‌లు, 9 బైక్‌లు, రూ.39,890 నగదు, 2 పందెం కోళ్లు స్వాధీనం చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. ఈ దాడుల్లో పాల్గొన్న ఎస్ఐ పాదర్తి కోటేశ్వరరావు, సిబ్బందిని సీఐ అభినందించారు.

■ సాగర్‌లో 'ఉస్తాద్' సినిమా షూటింగ్


విజయపురిసౌత్‌లోని లైటెక్ ఏవియేషన్‌లో జరుగుతున్న చిత్రీకరణ

విజయపురిసౌత్: ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి రెండో కుమారుడు శ్రీ సింహా కోడూరి హీరోగా ఉస్తాద్ అనే సినిమా షూటింగ్ నాగార్జునసాగర్, విజయపురిసౌత్‌లోని లైటెక్ ఏవియేషన్‌లో మంగళవారం జరిగింది. శ్రీసింహా కోడూరి మత్తు వదలరా, తెల్లవారితే గురువారం వంటి సినిమాల్లో నటించి హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమాలో హీరో సరసన బలగం ఫేమ్ కావ్య కళ్యాణ్‌రామ్ హీరోయిన్‌గా నటిస్తుంది. ఫణిదీప్ తోట డైరెక్షన్‌లో ప్రొడ్యూసర్‌లు రజనీ కొర్రపాటి, రాకేష్ గడ్డం, హిమాన్క్ దువ్వూరు ఆధ్వర్యంలో సినిమా రూపుదిద్దుకుంటుంది. మంగళవారంతో సినిమా చిత్రీకరణ మొత్తం పూర్తయిందని, గత సంవత్సరం ఆగస్ట్ నెలలో ప్రారంభమైన ఈ సినిమాను ఈ ఏడాది జూన్, జూలైలో విడుదల చేస్తామని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.